క్లుప్తంగా

బాధ్యతగా చదవాలి

నరసన్నపేట: పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోనికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. సత్యవరం ఉన్నత పాఠశాల వార్షికోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు బాధ్యతతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. బాగా చదివి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యే విద్యార్థులకు రూ. 10 వేలు అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ బాలరాజు, వార్డు సభ్యులు ఇప్పిలి నీలంరాజు, హెచ్ఎం వకులా రత్నమాల ఉన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నరసన్నపేట బోర్డు స్కూల్లో కూడా టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

సరుబుజ్జిలి: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ కిల్లి రమాదేవి కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఆస్పత్రికి అవసరమైన అన్ని పరికరాలు, మందులు, ఇతర సదుపాయాల కల్పన సక్రమంగా జరగాలని సూచించారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైద్యులు సంతోష్ కుమార్, సాహితి, బమ్మిడి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

లబ్బలో భూముల రీ వెరిఫికేషన్ రీసర్వే

కొత్తూరు: మండలంలోని లబ్బ గ్రామ సచివాలయం పరిధిలో భూముల రీ సర్వే వెరిఫికేషన్ ముమ్మరంగా జరుగుతుంది. భూముల రీ సర్వేలో పలు తప్పులు నమోదైనట్టు భూముల యజమానులు స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమల్ భూములు రీ సర్వే మరోసారి రీ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. దీంతో కొత్తూరు తహసీల్దార్ ఎంవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో రీ వెరిఫికేషన్ చేస్తున్నారు. కొత్తూరు రీ సర్వే డీటీ అనంతరావుతో పాటు హిరమండలం, ఎల్ఎన్‌పేట ఆర్ఎస్ డీటీలు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల్ని పరిష్కరిస్తాం

● రాష్ట్ర గిరిజన కమిషన్ చైర్మన్ శంకరరావు



మాట్లాడుతున్న శంకరరావు

మెళియాపుట్టి: గిరిజనులపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర గిరిజన కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గిరిజన సమస్యలపై గురువారం సమావేశం నిర్వహించారు. పలువురు గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలకు రహదారి, వైద్య సదుపాలయాలు కల్పించాలని కోరారు. మెళియాపుట్టిలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ.. జిల్లా, ఐటీడీఏ అధికారులతో సమీక్షించి సమస్యల పరిష్కరించడానికి కృషిచేస్తామని అన్నారు. సీతంపేట ఐటీడీఏ డీడీ అన్నదొర, ఏపీవో రోజ్ రెడ్డి, ఏటీడబ్ల్యూవో క్రిష్ణవేణి, తహసీల్దార్ జానకమ్మ, ఎంపీడీవో భాస్కరరావు, వైస్ ఎంపీపీ ఆదినాయుడు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు సవర సుభాష్, అలికాన మాధవరావు ఉన్నారు.

ఏకలవ్య పాఠశాల పరిశీలన

పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంలోని వైటీసీ భవనంలో నడుస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల (మెళియాపుట్టి)ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు గురువారం సందర్శించారు. పాఠశాల, విద్యార్థులకు చెందిన రికార్డులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీలను పరిశీలించారు. చైర్మన్‌కు గిరిజన నాయకులు పలు సమస్యలపై వినతపత్రాలు అందజేశారు. తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు, గిరిజన నాయకులు జి.అప్పన్న, బి.సింహాచలం ఉన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

ఆమదాలవలస: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ జి.రవి అన్నారు. గురువారం స్థానిక గేటు సచివాలయం పరిధిలో జరిగిన ఆరోగ్య సురక్ష ఫేజ్- 2 వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరంలో 441 మంది వైద్య సేవలు పొందారన్నారు. వీరికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది మున్సిపల్ సిబ్బంది, వైద్యులు, సచివాలయం కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై శిక్షణ

సరుబుజ్జిలి: ఓటుహక్కు సక్రమంగా వినియోగించుకొనే దిశగా మహిళా సమైఖ్యసంఘాల సభ్యులు పనిచేయాలని వెలుగు ఏపీఎం కమలకుమారి పాండ్యన్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మహిళాసంఘాల సభ్యులకు ఓటర్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు.

మహిళల హక్కులు కాలరాస్తున్న కేంద్రం

మెళియాపుట్టి: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మహిళల హక్కులను కాలరాస్తోందని ప్రగతిశీల జిల్లా మహిళా సంఘం (డీవో డబ్ల్యూ) జిల్లా కార్యవర్గ సభ్యురాలు గొందర ప్రభ అన్నారు. మండలంలోని గిరిజన గ్రామమైన రింపిలో మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు.



మహిళల పాత్ర కీలకం



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఆమదాలవలస: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంస్థ కో డైరెక్టర్ ధనలక్ష్మిని సత్కరిస్తున్న మహిళలు



ఆమదాలవలస: మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి



హిరమండలం: ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: సమాజంలో మహిళల పాత్ర కీలకమని వక్తలు అన్నారు. ఆమదాలవలస పట్టణంలో గురువారం అరుణోదయ స్వచ్ఛంద సేవా సంస్థ, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కో–డైరెక్టర్ ధనలక్ష్మితోపాటు పలువురు మహిళలను అభినందించి సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర సాహిత్య అకాడమి డైరెక్టర్ జె.జె.మోహన్‌రావు మాట్లాడుతూ.. చిన్నతనంలో తన బిడ్డకు ఉయ్యాల ఊపిన మహిళ దేశాన్నే తన చేయితో ఊపి శాసించే శక్తిగా ఎదుగుతున్నారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి ఫెడ్రిక్, అంతర్జాతీయ న్యూట్రిషన్ స్పెషలిస్ట్ డాక్టర్ శేషు, అరుణోదయ సంస్థ అధ్యక్షులు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజాన్ని సమన్వయ పరిచే శక్తిగా ఎదగాలి

ఆమదాలవలస: కుటుంబాన్ని, సమాజాన్ని సమన్వయ పరిచే శక్తిగా స్త్రీ ఎదగాలని కృషివిజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.ఎన్. స్వామి అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. మహిళా సాధికార విభాగాధిపతి ఉషా పద్మిని, కళాశాల అధ్యాపకులు అష్టలక్ష్మి, డాక్టర్ సాయికుమార్, డాక్టర్ శ్రీనివాసరావు, రాజశేఖర్, బాలరాజు, ప్రసాదరావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

నరసన్నపేటలో ర్యాలీ..

నరసన్నపేట: మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు అల్లు రమణమ్మ, దుర్గమ్మ, నిర్మళ, సోమేశ్వరి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

హిరమండలం: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని హెచ్ఎం టి.కేశవరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినులను సన్మానించారు. హెచ్ఎం మాట్లాడుతూ.. స్త్రీ ఎక్కడ గౌరవించబడుతుందో అక్కడే అభివృద్ధి సాధ్యమన్నారు. గతం కంటే అన్నిరంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం హర్షించదగ్గ పరిణామం అన్నారు.

బాధ్యతతో పనిచేయాలి



పాలక మండలి ప్రమాణ స్వీకారంలో కృష్ణదాస్, దువ్వాడ, తిలక్

జలుమూరు: శ్రీముఖలింగం ఆలయ నూతన పాలక మండలి సభ్యులు బాధ్యతతో పనిచేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పాలక మండలి ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. చైర్మన్‌గా బీవీ రమణ, సభ్యులుగా ఎస్.కృష్ణవేణి, వై.బాలమ్మ, కె.పండా, జి.సరోజిని, జె.గోపి, ఎస్.స్వాతి, వి.సంతోషి, ఎల్.రమేష్ గుప్తా, బీవీ సుబ్బారావులతో కృష్ణదాస్ ఆధ్వర్యంలో దేవదాయ శాఖ పర్యవేక్షకులు పి.ప్రభాకరరావు, ఈవో కె.వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే శ్రీలక్ష్మీ నరసింహా ఆలయం చైర్మన్‌గా అరుణ్‌కుమార్‌దాస్, సభ్యులుగా పి.అప్పలనాయుడు, ఎల్.రామయ్య, వి.పరమేశ్వరి, టి.భాగ్యం, ఎస్.దేవి, ఎస్.ఉగాది, విశ్వనాథ్‌దాస్ కూడా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. శివరాత్రి, ఇతర ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌సీ దువ్వాడ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, పార్టీట బీసీ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కె.హరిప్రసాద్ పాల్గొన్నారు.

‘చేయూత’తో మహిళలకు ప్రోత్సాహం

● ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల సమగ్ర అభివృద్ధికి, ఆర్థిక సాధికారత సాధించేందుకు వైఎస్సార్ చేయూత పథకాన్ని తీసుకువచ్చారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 45 నుంచి 60 సంవత్సరాల వయసు ఉన్న మహిళలందరికీ ఐదేళ్లలో రూ.75 వేలు ఆర్థిక సాయం చేయాలని భావించిన సీఎం ప్రతీ ఏడాది రూ.18,750 ఆర్థిక సహాయాన్ని అర్హత కలిగిన మహిళల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమచేయటం జరుగుతుందన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో నాలుగో విడత చేయూత పథకం ద్వారా 21,987 మంది మహిళలకు రూ.41.22 కోట్లు లబ్ధి పొందారని వివరించారు. కొత్తూరు మండలంలో 6,080 మందికి రూ.11.40 కోట్లు, హిరమండలంలో 3,148 మందికి రూ.5.90 కోట్లు, ఎల్.ఎన్.పేటలో 2,838 మందికి రూ.5.32 కోట్లు, మెళియాపుట్టిలో 4,574 మందికి రూ.8.57 కోట్లు, పాతపట్నంలో 5,347 మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.10.02 కోట్లు జయ చేయటం జరుగుతుందన్నారు.

నేటి నుంచి వైఎస్సార్ చేయూత సంబరాలు

పోలాకి: నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వైఎస్సార్ చేయూత సంబరాలను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య తెలిపా రు. ఈమేరకు పోలాకిలో గురువారం నాలుగు మండలాల షెడ్యూల్‌ను వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు పోలాకిలో, 9వతేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జలుమూరు, పదో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు సారవకోట, 11న మధ్యాహ్నం రెండు గంటలకు నరసన్నపేట మండలాల్లో లబ్ధిదారులతో సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వంశధార అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

సరుబుజ్జిలి: వంశధార అధికారుల నిర్లక్షపు ధోరణితో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, పలువురు సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖలవారీగా చర్చ చేపట్టారు. వంశధార అధికారులు కనీసం నెలకు ఒక్కరోజు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించడంలేదని సభ్యులు ఆరోపించారు. అనుకున్న సమయంలో సాగునీటి విడుదల చేయక పోవడంతో రైతులు సాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సభ్యులు తెలిపారు. నాడు–నేడు జేఈ పనితీరు సక్రమంగా లేకపోవడంతో పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో మంజూరు కాలేదని కొండవలస సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు సభ దృష్టికి తెచ్చారు. జేఈపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జలజీవన్‌మిషన్ పనులు సకాలంలో పూర్తిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు కోరారు. ఎంపీడీఓ రత్నం, తహసీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

నరసన్నపేట: మండలంలోని రావులవలస గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ పల్లి రమణతో పాటు మూడు కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. రమణతో పాటు మెరుగు బాలకృష్ణ, పల్లి లక్ష్మీనారాయణ, సీహెచ్ చలపతి కుటుంబాలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లి రమణ మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు రావులవలస ప్రజలు ఎప్పటి నుంచో కోరుకుంటున్న ప్రధాన రహదారి శాశ్వత స్థాయిలో నిర్మాణం కావడంతో వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా పల్లి రమణ ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కృష్ణదాస్ ఆవిష్కరించారు. పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య పాల్గొన్నారు.

పెత్తందార్లతో యుద్ధం: స్పీకర్



దళ్లిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు మెరుగుపడితే అభివృద్ధి జరుగుతుందని, అందుకే సీఎం వైఎస్ జగన్ రోడ్లు అభివృద్ధి చేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన గురువారం దళ్లిపేట గ్రామంలో రూ. 2.10 కోట్లుతో బీటీ రోడ్డు నిర్మాణానికి, అసిరితల్లి అమ్మవారి దేవాలయం నిర్మాణానికి రూ. 20 లక్షలు నిధులతో శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. ఒకవైపు సంక్షేమం, అభివృద్ధిని అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మరోవైపు పెత్తందార్లతో యుద్ధం చేస్తున్నారని అన్నారు. మనందరం పేదల పక్షాన నిలబడదామని చెప్పారు. పవన్ కల్యాణ్, చంద్రబాబు నాయుడులు ఏం చేస్తున్నారో వారికే తెలీదని ఎద్దేవా చేశారు. పొందూరులో డిగ్రీ కళాశాల, లోలుగు కేజీబీవీ జూనియర్ కళాశాల, పొందూరులో జ్యోతీరావుపూలే రెసిడెన్షియల్ స్కూల్, మడ్డువలస కాలువ, తండ్యాం, లైదాం ఎత్తిపోతల పథకాలు తదితర పనులు చేశానని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, సర్పంచ్ కంబాపు నీలవేణి, కంబాపు సూర్యారావు, పెద్దింటి రవిబాబు, తవిటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యానికి ప్రాధాన్యం

పొందూరు: పశువైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. రాపాక గ్రామంలో నూతనంగా నిర్మించిన పశువుల ఆస్పత్రిని గురువారం ప్రారంభించారు. నాబార్డ్ నిధులు రూ. 26.50 లక్షలతో దీన్ని నిర్మించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, నాయకులు వండాన వెంకటరావు, కొంచాడ గిరిబాబు, బండారు ప్రతాప్‌కుమార్, పశుసంవర్ధకశాఖ జేడీ ఎం.కిషోర్, ఏడీఈలు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ రాజశేఖర్, పశువైద్యాధికారి డాక్టర్ పద్మావతి ఉన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

పొందూరు: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని పొందూరు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లోలుగు గ్రామంలోని కేజీబీవీలో న్యాయవిజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. మహిళలకు భద్రత చేకూరుస్తున్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొనే సత్తా చదువుతోనే సాధ్యమవుతుందని చెప్పారు. వ్యక్తిత్వం అంతః సౌందర్యమని, బాహ్య సౌందర్యం కంటే అంతః సౌందర్యం గొప్పదని అన్నారు. ఈ సందర్భంగా పొందూరుకు చెందిన వాసవి గ్లోబల్ స్పిరిట్యువల్ కౌన్సిల్ అధ్యక్షుడు బండారు జైప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో జడ్జి జ్యోత్స్నను సత్కరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య, న్యాయవాదులు కె.జె.మంజుల, బ్రహ్మాజీ, రాము ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఆమదాలవలస రూరల్: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందు ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం మహిళా హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. హక్కుల కోసం పోరాడాలంటే ముందు తమకున్న హక్కులు, విధులు ఏమిటో తెలుసుకోవాలని సూచించారు. న్యాయవాదులు సీపాన గోవిందరావు, కింతలి త్రినాధరావు, బొడ్డేపల్లి మోహనరావు, తమ్మినేని అన్నంనాయుడు, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు.

మార్కెట్ వేలం ఖరారు

ఆమదాలవలస: పురపాలక సంఘ పరిధిలోని మార్కెట్‌లో ఆశీలు వసూళ్ల కోసం బహిరంగ వేలం పాటను మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జి.రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. బొడ్డేపల్లి దాలినాయుడు రూ. 24 లక్షల 50 వేలకు దక్కించుకున్నారు. గత ఏడాదికంటే రూ. 5 లక్షలు అదనంగా ఆదాయం సమకూరిందని కమిషనర్ తెలిపారు. అలాగే కమేళా నిర్వహణకు కూడా వేలం నిర్వహించగా బొడ్డేపల్లి దాలినాయుడు లక్ష రూపాయలకు పాటను దక్కించుకున్నారు. చింతాడలో ప్రతి శనివారం నిర్వహించే వారపు సంత ఆశీల వసూళ్ల కోసం వేలంను మరోసారి నిర్వహిస్తామన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి ఊసవానిపేట రైల్వే గేటు సమీపంలో పలాస వైపు వెళ్లే డౌన్ లైన్‌లో గురువారం గుర్తుతెలియని మహిళ రైలు ఢీకొని మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతురాలి వయసు సుమారు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుంది. ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించామని, సమాచారం ఉంటే జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

బీఎల్‌వోలు సక్రమంగా పని చేయాలి

సారవకోట: బీఎల్‌వోలు ఎన్నికల విధుల్లో అలసత్వం వహించరాదని తహసీల్దార్ భాగ్యవతి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలతో గురువారం సమావేశం నిర్వహించారు. రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని అన్నారు.

లోతుగెడ్డ సస్పెన్షన్ సబబే

● వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు తదితరులు

కొత్తూరు: పార్టీకి, స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు చేపట్టిన వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావును వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేయడం సబబే అని పార్టీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో గురువారం విలేకరులతో మాట్లాడారు. 2019 సంవత్సరం ఎన్నికల్లో తులసీవరప్రసాదరావుని టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీసుకువచ్చారన్నారు. ఎంపీటీసీగా, వైస్ ఎంపీపీగా, పీఏసీఎస్ చైర్మన్‌గా, పార్టీ జిల్లా కార్యదర్శిగా పదవులు అనుభవించిన ఆయన పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడటంతో పాటు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సభలు, సమావేశాలు నిర్వహించడం సరికాదన్నారు. పార్టీకి నష్టం కలిగించేనవారు ఎంతటి వారైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే రెడ్డి శాంతిలు ఉపేక్షించేది లేదన్నారు. పార్టీకి నష్టం కలిగించే నేతలకు ఇదో గుణపాఠం అన్నారు. సీఎం జగన్ సహకారంతో పాతపట్నం నియోజవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశారన్నారు. ఎటువంటి అవినీతి మరకలేని ఎమ్మెల్యేని తులసీ వరప్రసాదరావు విమర్శించడం తగదన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన అతన్ని సస్పెండ్ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ గండిలస ఆనందరావు, జిల్లా వ్యవసాయ సలహా సంఘం సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, పార్టీ మండల కార్యదర్శులు మఠం పూర్ణ, పంకజదాస్, సర్పంచ్‌లు సాధుబాబు, ధర్మారావు, అశోక్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, పార్టీ నేతలు జి.రాజులునాయుడు, బి.రామకృష్ణ, తిర్లింగ కృష్ణమోహన్, గోపాలరావు, తమ్మినాయుడు, శేషగిరి, బొమ్మాళి నాగసతీష్ ఉన్నారు.